క్లుప్తంగా

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

మదనపల్లె సిటీ: పాలిసెట్–2025 కౌన్సెలింగ్ శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్ ఎం.హరిప్రసాద్ తెలిపారు. స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో పాలిసెట్–25 పరీక్ష రాసి, అర్హత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కాలేజీ ఆవరణలో ఈనెల 21 నుంచి 28వతేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి షెడ్యూలు ప్రకారం నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లు తో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. ఎస్టీ విద్యార్థులకు తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్ కాలేజీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. 21వ తేదీన ఒకటో ర్యాంకు నుంచి 15,000 వరకు, 22వతేదీన 15,001 నుంచి 32,000 వరకు, 23న 32,001 నుంచి 50,000 వరకు, 24న 50,001 నుంచి 68,000 వరకు, 25వ తేదీన 68,001 నుంచి 86,00 వరకు, 26న 86,001 నుంచి 1,04,000 వరకు, 27వతేదీన 1,04,001 నుంచి 1,20,00 వరకు 28వ తేదీన 1,20,001 నుంచి లాస్టు ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

పీలేరు : పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఆర్‌లను అమలు చేయాలన్నారు. పెన్షనర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ సమావేశాల్లో కోత విధించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు శాఖ అధ్యక్షులు చంద్రారెడ్డి, యర్రమరాజు, సీతారామయ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె: స్థానిక టీఎస్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో 2025–26 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి రెండవ విడత దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, సివిల్ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లకు పదోతరగతి పాస్, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు జులై 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో లేదా ఐటీఐ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లు జులై 17లోపు వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. 21వతేదీ వెరిఫికేషన్ పూర్తయివారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

సారా స్వాధీనం

మదనపల్లె రూరల్ : నిమ్మనపల్లె మండలంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో పెద్దమాదిగపల్లె గ్రామంలో సారా అమ్ముతున్న వర్ల వెంకటరమణ (38)ను అరెస్ట్ చేసి, ఆరు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భీమలింగ తెలిపారు. శుక్రవారం వెంకటరమణను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. గ్రామాల్లో నాటుసారా తయారీ, నిల్వ, విక్రయానికి పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, సిబ్బంది శ్రీనివాసులు, రేఖ, మణి, మధు తదితరులు పాల్గొన్నారు.

కురవపల్లెలో మాజీ ఎమ్మెల్యే పర్యటన



కాబోయే వధూవరులతో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవుల సహదేవయ్య కుమార్తె కవిత నిశ్చితార్థం కార్యక్రమం శుక్రవారం స్థానిక ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నియోజకవర్గానికి చెందిన కృష్ణయ్య, సాయిచందన్‌రెడ్డి, వసంతమ్మలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హబీబ్‌బాషా, మునీర్, చక్రధర్, భువన, పి. ద్వారకనాథరెడ్డి, బుల్లెట్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

బి.కొత్తకోట: జిల్లా అభివృద్ధి కోసం ఈనెల 23న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ధర్నా పోస్టర్లను కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధిని వివరించారు. రఘునాథ్, అష్రఫ్‌లీ, తంబయ్యశెట్టి, నారాయణస్వామి, గంగులప్ప పాల్గొన్నారు.

ఎవరొస్తున్నారో.. ఏం చేస్తున్నారో..?

- ఠాగూర్ ఆడిటోరియంలో అసాంఘిక కార్యకలాపాలు
- శిథిలావస్థలో భవనం
- ఇదే అనువుగా భావించిన ఆకతాయిలు



అసంపూర్తిగా ఠాగూర్ ఆడిటోరియం

మదనపల్లె సిటీ: విశ్వకవి రవీంద్రుడు నడియాడిన నేల ఇప్పుడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. మదనపల్లెకు డాక్టర్ అనిబిసెంట్ దివ్య జ్ఞాన కళాశాల ఎంతో ఘనకీర్తిని తెచ్చింది. శత వసంతోత్సవాల్లో భాగంగా కాలేజీ అభివృద్ధికి అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి వరాలు కురిపించారు. 2012 సంవత్సరం జనవరి 25వతేదీన కాలేజీ ఆవరణలోని రవీంద్రనాథుడు బస చేసిన కాటేజీ సమీపంలో ఠాగూర్ ఆడిటోరియానికి శంకుస్థాపన చేశారు. ఇందులో ఆడిటోరియంతో పాటు మెడిటేషన్ హాలు, ఠాగూర్ లైబ్రరీ నిర్మాణం కోసం రూ.6 కోట్లు మంజూరు చేశారు. అయితే రూ.3.10 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో ఆడిటోరియం, మెడిటేషన్ హాలు ప్రహరీతో పాటు భవనాలకు మోల్డింగ్ వరకు చేశారు. తర్వాత భవనాన్ని పట్టించుకోవడం మానేశారు. ఆడిటోరియం చుట్టూ కంపచెట్లు పెరిగిపోయాయి.

అపరిశుభ్రంగా పరిసరాలు

అసాంఘిక కార్యకలాపాలకు కొందరు అడ్డా మార్చుకున్నారు. మద్యం తాగాక ఖాళీ మద్యం సీసాలను పడేస్తున్నారు. కొందరు ఆకతాయులు వాటిని పగలగొడుతున్నారు. భవనంలో మద్యం తాగిన బాటిళ్లు, సిగరెట్లు, బీడీలు, గుట్కాలు, ఇతర వస్తువులతో అపరిశుభ్రంగా మారింది. ఎవరొస్తున్నారో.. ఏం చేస్తున్నారో.. అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఆడిటోరియం పూర్తయితే సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రంథాలయం ఏర్పాటు, మెడిటేషన్ వంటి చేసుకోవచ్చు. ప్రభుత్వం స్పందించి ఆడిటోరియం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యావేత్తలు చెబుతున్నారు.



ఠాగూర్ భవనంలో నిలిచిపోయిన హాల్ నిర్మాణం



పేరుకుపోయిన వ్యర్థాలు

సోలార్ రూఫ్‌టాప్‌లతో విద్యుత్ ఆదా



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏడీఈ గోవిందరెడ్డి

తంబళ్లపల్లె: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లను నిర్మించుకుంటే విద్యుత్ ఖర్చును ఆదా చేసుకోవచ్చని ట్రాన్స్‌కో ఏడీఈ గోవిందరెడ్డి కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో ఏర్పాటు చేసే సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ వినియోగదారులు తమ ఇళ్లపై కేంద్ర ప్రభుత్వం రాయితీతో అందించే సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా బిల్లు ఆదా అవుతుందన్నారు. కిలో వాట్ సామర్థ్యం గల సోలార్ ప్యానల్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్‌లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్‌లకు గరిష్ఠంగా రూ.78వేలు కేంద్ర ప్రభుత్వం రాయితీగా అందిస్తుందన్నారు. అతి తక్కువ వడ్డీకే బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చునని తెలిపారు. సదస్సులో ఎంఈఓ త్యాగరాజు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ థామస్, ఏఈ సురేంద్ర, సబ్ ఇంజినీర్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో కార్మికుల నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని నినాదాలు చేస్తున్న కార్మికులు

మదనపల్లె: సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు శుక్రవారం కళ్లకు గంతలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఎంఎస్.కన్నయ్య మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగ కార్మికులకు వేతనాల చెల్లింపు విధానం, కార్మికులకు సంక్షేమ పథకాల వర్తింపు కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనల అనంతరం 22 నుంచి కార్మికులు మెరుపు సమ్మె చేస్తున్నట్టు ప్రకటించారు. తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ పూర్తిగా నిలిపివేస్తామని తెలిపారు. 17రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, నాగరాజు, బాలకృష్ణ, బాబు, గోపాలకృష్ణ, కుమార్, సజాద్, మహేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న పాలకుంట శ్రీనివాసులు

పీలేరురూరల్ : కేవీపల్లె మండలం గర్నిమిట్ట పంచాయతీ మల్లారపువాండ్లపల్లె పంచాయతీ దళితుల కాలనీ వద్ద అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలకుంట శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలు దళితులు ఘనంగా నిర్వహించేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య, గుండ్లూరు రవీంద్ర, ముల్లంగి గురవయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

పీలేరురూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్న డీఎం బి. నిర్మల అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రూ. 6 లక్షలతో సీలింగ్ రిపేర్లు, పెయింటింగ్, సీలింగ్ ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి సౌకర్యం తదితర పనులు చురుగ్గా చేపట్టినట్లు తెలిపారు. ఆర్టీసీ ఈడీఈ చెంగల్‌రెడ్డి ఆదేశాల మేరకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. మరుగుదొడ్ల నిర్మాణానికి కూడా నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మదనపల్లె సిటీ: ప్రయాణికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం డిపో కార్యాలయంలో అద్దె బస్సు యజమానులతో సమావేశం నిర్వహించారు. బస్సులు మంచి కండిషన్‌తో ఉండాలన్నారు. సమయ పాలన పాటించాలన్నారు. బస్సులు సమయ పాలన పాటించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి



సూచనలిస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జనార్దన్

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయంలో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని దేవాదాయశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జనార్దన్ సూచించారు. శుక్రవారం ఆలయంలో నిర్మాణ పనులు పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా చూసుకొనే బాధ్యత స్థానిక అధికారులపై ఉందన్నారు. దేవాదాయశాఖ ఏఈ శ్రీకాంత్, ఆలయ ఈఓ మంజుల,సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు నమోదు ప్రక్రియ

పీలేరు : మండలంలో ఓటర్ల నమోదు కార్యక్రమం పారదర్శకంగా చేపట్టాలని ఈఆర్ఓ బి.అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మరణించిన వారు, గ్రామాలు వదలి వెళ్లిన వారిని గుర్తించి తొలగించాలని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలని తెలిపారు. 1,200 ఓట్లకు మించిన పోలింగ్ కేంద్రాలు నియోజకవర్గంలో 20 ఉన్నాయని, అవసరాన్ని కేంద్రాలను పునర్విభజన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివకుమార్ పాల్గొన్నారు.

మలేరియా నివారణకు సమష్టి కృషి



ర్యాలీలో వైద్య, ఆరోగ్య సిబ్బంది

కేవీపల్లె : మలేరియా నివారణకు సమష్టిగా కృషి చేద్దామని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ – అక్టోబర్ మధ్యకాలంలో మలేరియా ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. దోమకాటుకు గురి కాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. ఇంటి సమీపాల్లో నీరు నిల్వలేకుండా జాగ్రత్త తీసుకోవాలని పేర్కొన్నారు. నీటి తొట్టెలు వారానికి ఒకసారి శుభ్రం చేయాలన్నారు. డాక్టర్ అర్చన, మలేరియా సబ్ యూనిట్ అధికారి ముజీబ్‌బాషా, సీహెచ్‌వో భాగ్యలక్ష్మి, పీహెచ్ఎన్ రమాదేవి, సూపర్‌వైజర్లు రుక్మిణి, పురుషోత్తం, హెల్త్ అసిస్టెంట్లు వెంకటరత్నం, రహీనబేగం, ఫార్మాసిస్ట్ రమణి, ల్యాబ్ టెక్నీషియన్ స్వర్ణలత పాల్గొన్నారు.

జాయింట్ పట్టాలను విభజన చేసుకోండి

మదనపల్లె రూరల్ : మండలంలో రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు విడివిడిగా విభజన చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కిషోర్‌కుమార్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రీసర్వే పూర్తి అయిన కాశీరావుపేట, పామయ్యగారిపల్లె, మొలకలదిన్నె, తేనేగలవారిపల్లె, చిప్పిలి, అంకిశెట్టిపల్లె, పప్పిరెడ్డిపల్లె, వెంకప్పకోట గ్రామాలకు సంబంధించి వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు.. భూములను విభజన చేసుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుము రూ.550ను పూర్తిగా మినహాయించి, ఉచితంగా సేవను పొందేందుకు అవకాశం కల్పించిందన్నారు. దీనికి కేవలం రూ.50 నామమాత్రపు దరఖాస్తు రుసుము ఆయా గ్రామ సచివాలయాల్లో చెల్లించి జూన్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించారని పేర్కొన్నారు.

ఒత్తిడిని జయించే సాధనం యోగా



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థినులు

మదనపల్లె సిటీ: ప్రతిరోజు యోగా చేయడం వలన ఆరోగ్య పరిరక్షణతోపాటు ఒత్తిడిని జయించే సాధనంలా పనిచేస్తుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణవేణి అన్నారు. యోగాంధ్ర కార్యాక్రమంలో భాగంగా శుక్రవారం కాలేజీ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థిదశ నుంచి యోగా సాధన అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అధ్యాపకులు జ్యోతి, మోహన్‌వల్లి, సూర్యశేఖర్‌రెడ్డి, ఖాజావల్లి, సుబ్బరాయుడు, వెంకటశివ పాల్గొన్నారు.

10 గంటల పని విధానం రద్దు చేయాలి



పీలేరు : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు



మదనపల్లె: ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పీలేరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 10 గంటల పని విధానం రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న కార్మికుల పనిగంటలు తగ్గించాలని కోరారు.పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు నాలుగు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణమ్మ, నీలావతి, రమాదేవి, సరస్వతి, నూర్‌జాన్, సుమతి, సంధ్య, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై కక్ష

బి.కొత్తకోట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరచిన ప్రభుత్వం కార్మికుల సంక్షేమంపై కక్షకట్టిందని ఏఐటీయూసీ నాయకులు విమర్శించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికుల పనిగంటల మార్పు చట్ట సవరణను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల పనిగంటలు పెంచడం దారుణమన్నారు. దీన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలైన తల్లికి వందనం అర్హులందరికి అందలేదన్నారు. సూపర్ సిక్స్ ఎక్కడ అమలు చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ బావాజాన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి, బాలకృష్ణ, గఫూర్, కుమార్, నరసింహులు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

మదనపల్లె: కార్మికుల పని గంటలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ శుక్రవారం ఏఐటీయూసీ స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 8 గంటల పని విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గతంలో రాత్రివేళల్లో మహిళలకు విధుల నిర్వహణ మినహాయింపు ఉండేదని ప్రస్తుతం దీన్ని తొలగించడం తగదన్నారు. మున్సిపల్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, మురళీ, ముబారక్, దేవా, జానకి, ఇంద్రాణీ, రాధ, ప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ధర్నా



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

మదనపల్లె: సచివాలయ ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం జారీ చేసిన జీవోని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణానికి చెందిన వార్డు సచివాలయ ఉద్యోగులు మున్సిపల్, సబ్‌కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. నిరసన నినాదాలు చేశాక ఇక్కడి నుంచి ర్యాలీగా సబ్‌కలెక్టర్ కార్యాలయం చేరుకుని అక్కడ ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగరాజ మాట్లాడుతూ జీవో ఉద్యోగులను ఇబ్బంది పెట్టే విధంగా ఉందన్నారు. స్పష్టత లేకుండా చేపట్టే బదిలీలతో ఉద్యోగులకు అవస్థలు తప్పవన్నారు. ఇంక్రిమెంట్లు, ప్రొబేషనరీ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఏఓకు ఉద్యోగులు వినతిపత్రం అందించారు. శరత్‌కుమార్‌రెడ్డి, నందిని, రాజారెడ్డి, హేమలత, అభిషేక్, వినోద్, విజయకుమార్‌రెడ్డి, ఆనంద, మునుస్వామి, హరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరురూరల్ : పీలేరు పట్టణంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ హబీబ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వాటర్‌మెన్‌లు, మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యలపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. పైపులైన్లు, గేట్‌వాల్వ్‌ల మరమ్మతు పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలన్నారు. మరమ్మతులకు గురైన ఆర్‌వో ప్లాంట్ల పనులు వెంటనే చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా పరిపాలనలో రెవెన్యూశాఖ కీలకం

- ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు
- విశ్రాంత ఉద్యోగులకు సత్కారం



మదనపల్లె రూరల్ : విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సత్కరిస్తున్న డీఏఓ, తహసీల్దార్

మదనపల్లె రూరల్ : ప్రజాపరిపాలనలో రెవెన్యూశాఖ అత్యంత కీలకమైనదని, ప్రతి రెవెన్యూ ఉద్యోగి రోజురోజుకు జ్ఞానాన్ని పెంపొందించుకుని విధులు నిర్వహిస్తే అద్భుతమైన ఫలితాలు ఉంటాయని సబ్ కలెక్టరేట్ డీఏఓ నిర్మలాదేవి అన్నారు. జూన్ 20, రెవెన్యూ డే సందర్భంగా శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఏఓ నిర్మలాదేవి మాట్లాడుతూ సమాజంలో ఏ సంక్షోభం ఎదురైనా తొలుత రెవెన్యూశాఖ స్పందించి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. బ్రిటీష్ కాలం నుంచి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా రెవెన్యూశాఖ పనిచేస్తోందన్నారు. ఎన్నికల నిర్వహణలోనూ కీలకపాత్ర రెవెన్యూశాఖదేనని పేర్కొన్నారు. తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూశాఖ నుంచి మెరుగైన సేవలందించేందుకు ప్రజలు సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్నారు. అనంతరం రెవెన్యూశాఖలో ఉత్తమ సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన డిప్యూటీ తహసీల్దార్‌లు వీఎస్ఎన్.శర్మ, శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. సివిల్ సప్లయిస్ డీటీ ఎన్.ఫిరోజ్‌ఖాన్, ఏఎస్ఓ సురేష్, ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

పాలనలో రెవెన్యూ శాఖది 'పెద్దన్న' పాత్ర

పెద్దతిప్పసముద్రం: పరిపాలనలో రెవెన్యూ శాఖ పెద్దన్న పాత్ర పోషిస్తోందని తహసీల్దార్ శ్రీరాములు నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్యంకు మునుపే ఈస్ట్ ఇండియా పాలకులు 1786 జూన్ 21న రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు 'రాజస' అని నామకరణం చేశారని అధికారులు గుర్తు చేసారు. ప్రధానంగా ప్రకృతి వైపరిత్యాలు, పంట నష్ట పరిహారం అంచనా, భూమి శిస్తు, జనన, మరణాల నమోదు తదితర విషయాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ పాత్ర కీలకమని అధికారులు పేర్కొన్నారు.

రెవెన్యూ పాత్ర కీలకం

కురబలకోట: అన్ని ప్రభుత్వ శాఖల కన్నా ప్రజలకు అందించే సేవలలో రెవెన్యూ పాత్ర కీలకమని కురబలకోట తహసీల్దారు ధనుంజయులు తెలిపారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయం వద్ద రెవెన్యూ డేను ఉత్సాహంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖతో ప్రజలకు విడదీయరాని సంబంధం ముడిపడి ఉంటుందన్నారు. భూ హక్కులు, పట్టాదారు పాసుబుక్కులు, వివిధ సర్టిఫికెట్లు, భూ రికార్డుల నిర్వహణ, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది పాత్ర ప్రాముఖ్యమైనదన్నారు. ఉద్యోగులు కూడా రెవెన్యూ చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించుకుని విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు.

జవాబుదారితనంతో పనిచేద్దాం

కలికిరి: రైతులకు, ప్రజలకు జవాబుదారితనంతో పని చేసి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకువద్దామని ఇన్‌చార్జి తహసీల్దారు సయ్యద్ అహ్మద్ అన్నారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ ఉద్యోగి ప్రవర్తన రెవెన్యూ శాఖ ఉన్నతికి దోహదపడేలా ఉండాలన్నారు. కార్యక్రమంలోమండల సర్వేయరు రెడ్డెప్ప, సబ్ రిజిస్ట్రారు పార్థసారథి, సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్ పీరా, వీఆర్ఓలు ప్రసాద్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, దశరథ, గౌరి, సుల్తాన్ బాషా, ఆదిలక్ష్మి, నరేష్, విశ్రాంత వీఆర్ఓ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూశాఖ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అనంతరం రిటైర్డ్ ఆర్ఐ రమణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వశిం అక్రమ్, సీనియర్ అసిస్టెంట్ రెడ్డెప్ప, సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దతిప్పసముద్రం: మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీరాములు నాయక్



కురబలకోట: రెవెన్యూ డే కార్యక్రమంలో తహసీల్దారు ధనుంజయులు



రామసముద్రం: మాట్లాడుతున్న తహసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్